# శ్రేయోరాజ్యంలో పానకాలరాయుళ్లు

"రత్నం"

కథానిక

"శ్రేయోరాజ్యంలో విద్యాభివృద్ధి" అంచనాలు కడుతున్నాడు రేడియోలో ఓ విద్యాధికుడు.

పకపక నవ్వు బుద్ధేసింది వామనరావుకు. నిర్లక్ష్యంతో కూడిన పరిహాసం అలలు అలలుగా పొంగి చిరునవ్వు రూపంలో తెరమీద కన్పించింది.

పెరిగిన స్కూళ్ళూ, సంస్కరించిన గ్రంథాలికా, తొలగిన నిరక్షరాస్యతా, ఊహాచిత్రాన్ని నిరూపిస్తున్నాడు రేడియో వ్యాఖ్యాత.

చీమకుట్టినట్టయినా అనిపించలేదు హెడ్మాష్టరు వామనరావుకు. పైగా నవ్వొస్తున్నది ఆ ఉపన్యాసకుడి అజ్ఞానానికి!

• • •

కాలేజీలో చదివేరోజుల్లో 'పాలిస విద్యా విధానం నశించాలి! నూతన విద్యా విధానం కావాలి!' అని చెవులు గింగురుమనేట్టుగావు కేకలు పెట్టినవాడే వామనరావు. 'బతకలేక బడిపంతులు' అనుకుంటూనే పదిహేనేళ్ళ క్రితం ట్రయినింగు పూర్తిచేసి టీచరుగా చేరేడు ముప్పైఫరూపాయల ఉద్యోగంలో. ఆర్జన మొదలెట్టిన దగ్గర్నుంచీ ఆశయాల జోలికి పోలేదు వామనరావు. ఇంతకీ అతడు బతకదల్చుకున్నాడు!

పెద్దకమ్మవారి ఆధిపత్యంలో ఉన్న హైస్కూలు. అడక్కుండానే ఇంటికొచ్చే కూరానారా, ఉచితంగా ఓ యిల్లూ, ట్యూషన్‌కి ఓ పాతికమంది పెద్దింటి పిల్లలూ—దివ్యంగా గడిచిపోయింది కాలం వామనరావుకు.

పదివేలదాకా వెనకేశాడని నలుగురూ అనుకుంటారు. సంతానం కూడా అరడజను దాటిందని లెక్కేసి చెప్పాడు లెక్కల పంతులు. 'సంతానప్రభువు'—అని శాస్త్రీయ పరిభాషలో వ్యాఖ్యానించాడు సైన్స్‌మాష్టరు. 'చంటి నొకడు, చంక నొకడు...' పద్యంతో ఆ వైభవాన్ని వర్ణించాడు తెలుగుపండితుడు. నిజానికి వామనరావు కీర్తికాముడేమీ కాదు. అక్కర్లేకపోయినా అందరినోళ్ళల్లో నానే ముడిసరుకంతా వామనరావు తత్వంలో ఉంది.

మూడేళ్ళక్రితం కొత్త స్కూళ్ళ పుణ్యమా అని హెడ్మాష్టరు గిరీ దానంతటికదే తోసుకొచ్చింది. మూలమూలలా పూరిపాకల్లోనూ, గొడ్లసావిళ్ళలోనూ అరుబయటా స్కూళ్ళు వెలియటం మూలాన "హెడ్మాష్టరుగిరి"కి ప్రమోషన్ తప్పలేదు వామనరావుకు. ఆర్డరువచ్చిన మరునాడే ట్రాన్స్‌ఫర్ అయిన ఊరికి అదరాబాదరావచ్చి కుర్చీ స్వాధీనం చేసుకున్నాడు ఆర్భాటం కొద్దీ!

చదువు చెప్పే విషయంలో ఆత్మవిశ్వాసం ఏమాత్రంలేదు వామనరావుకు. గడచిన సర్వీసులో ఆఫీసు పని బాగా చేస్తాడని మాత్రమే అతనికి పేరు. రికార్డులు దేనికది సర్దటం, పైవాళ్ళతో ఉత్తరప్రత్యుత్తరాలు, పనికివచ్చే రూల్సూ—ఇవన్నీ అతనికి కొట్టిన పిండే. టీచరుగా అంత సర్వీసు లోనూ అతడు సాధించిందే అది! కాని అదేం ఖర్మమో తప్పనిసరిగా పేసైతేనే పదవినిలుస్తుందన్న 'ఎకౌంటింగ్' పరీక్షలో నాలుగుసార్లు దండయాత్రచేసి మళ్ళా తరిఫీదు మొదలెట్టాడు! 'గడువు దగ్గరపడిన కొద్దీ భయం ఎక్కువై జ్ఞాపకశక్తి నశిస్తున్నద'ని అడిగిన వాళ్ళతో చెప్తుంటాడు.

హెడ్మాష్టరు పదవి వచ్చిన మొదటిరోజుల్లో పద్మవ్యూహంలో ఇరుక్కున్నట్టు ఫీలయ్యాడు వామనరావు. ఉత్తఅనుమానం మనిషవడంమూలాన బాదరబందీ కూడా ఎక్కువయింది. ఎలిమెంటరీ స్కూల్లో నాల్గు రోజులపాటు హెడ్మాష్టర్లుగా వెలిగించి హైస్కూళ్ళకు ఎగుమతైన పంతుళ్ళంటే అతడికి చచ్చేభయం ఎందుకనో! వాళ్ళు అఘటన ఘటనా సమర్థులని అతడి అనుభవపూర్వకమైన దృఢవిశ్వాసం. కదిలిస్తే దాన్నిగురించి తనకు తెలిసిందంతా కట్టుకథలుగా చెప్తాడు. తిమ్మిని బెమ్మిని చేస్తారుట...! ఒకటిని ఏడుగా మారుస్తారుట...! "వామనరావు వ్రాలు" అని తారీ

ఖుతో సహా ఫోర్జరీ చేయగల సమర్థులట!" కలలో కూడా ఇంతింత లేసి కోర్లతో మిడిగుడ్లతో వాళ్లు మీది మీదికి వస్తారని వామనరావు సన్నిహితులు కూడా అంటుంటారు!

పొట్టివాడికి బుద్ధుల్లేకేం! వామనరావుకో ఉపాయం తట్టింది. "దొంగచేతికే తాళం చెవి యిస్తే!—కుదటబడి భారం తొలగినట్టు ఓ నిట్టూర్పు విడిచాడు.

తమ కివ్వకుండా ,'సెకండరీగ్రేడ్' వాళ్ళకే 'ఇన్‌చార్జి' యిస్తుంటే పట్టభద్రులకి తగని గుర్రుగా ఉండేది. తమ అభివృద్ధి వామనరావు చేతుల్లో ఉన్నట్టు భయపడి వాళ్ళు కిమ్మనేవాళ్లుగాదు. వాళ్ళ అవస్థను చూసి తన తెలివితేటలకు తానే మురుసుకొనేవాడు వామనరావు.

పదవిలో పైకివచ్చినా ఆదాయం తగ్గట్టు పెరగలేదు వామనరావుకు. బీదఊరూ క్రొత్త స్కూలూ అవడం మూలాన ఒక్కడన్నా ట్యూషనుకి వస్తానని అడిగిన పాపానపోలేదు. నాలుగు ముక్కలు చెప్పించుకుని మిరపకాయలో...కంది గింజలో కాసిని పంపిస్తే యేంపోయిందని అతడి ఆవేదన.

"వాళ్ళకెందుకండీ చదువు...ఊరికే చెప్తామన్నా ఒక్కడూ రాకపోతే...!" అర్థోక్తిలో అసలుబాధ బయటపెట్టేవాడు.

కొత్తమార్గాన్ని వెతక్క తప్పలేదు వామనరావుకు చివరికి.

"నువ్ బీడీ తాగావ్...మూడురూపాయలు జరిమానా వేశాక పో...!" ఉరిమిచూశాడు ఒకణ్ణి, వాళ్ళింట్లో జింకతోళ్ళున్నాయని తెలిసి.

"గ్రౌండ్‌లో ఎందుకు న్యూసెన్సు చేశావ్? ఐదురూపాయల ఫైన్ నీకు!" బెదిరించాడు ఇంకో కణ్ణి. వాళ్ళ ఊళ్ళో ఒకటోతరగతి పుట్టతేనె దొరుకుతుందని ఊహించి.

చదువుకోవాలనే ఉందో ... జడుసుకొనో యేమో పాపం, మరునాటికల్లా తేళ్ళలా బెదరుతూ తోళ్ళూ తేనె మిరపకాయలూ కట్టె పుల్లలూ కానుకలుగా సమర్పించారు యముడిలా కన్పిస్తున్న వామనరావు పాదపద్మాలముందు.

విజయగర్వం మొదటిసారిగా వామనరావు కళ్ళల్లో తొంగిచూసింది.

రేడియో ఇంకా అరుస్తూనే ఉంది శ్రేయోరాజ్యంలో విద్యాభివృద్ధిని గురించి.

ఈసారి పకపకా నవ్వేశాడు వామనరావు.

తమ పుస్తకాలు శ్రేష్ఠమైనవనీ తమవస్తువులు అపురూపమైనవనీ ఉచితంగా పంపిన రకరకాల రంగుల కేలండర్లు చుట్టూ గోడల్ని వ్రేలాడుతూ గాలికి తపతప కొట్టుకొని అతడి నవ్వుకు చప్పట్లు చరిచినయ్.

ఈజీచైర్‌లో ఎత్తుగా బొత్తికపెట్టివున్న జింక తోళ్ళన్నీ వామనరావు భారానికి...ఆ నవ్వు కుదింపులకి సన్నగా మూలిగినయ్.

వంటింట్లోనుంచి మాడిన మిరపకాయల ఘాటు వామనరావు నవ్వును ఉక్కిరిబిక్కిరిచేసి మూడో స్థాయికి నెట్టింది.

"స్పెషల్ ఫీజులు ఏ సంవత్సరాని కా సంవత్సరం ఖర్చుపెట్టెయ్యాలి... కానీ మిగల్చగూడ"దన్న డైరెక్టర్ ఫరమానా నోరు తెరచుకొని వామనరావు వంక విచిత్రంగా చూసింది.

ఫీజులు ఖర్చుపెట్టటంలో హెడ్మాస్టరువే సర్వాధికారాలు. కమిటీలు కూడా ఉండొచ్చు! జిల్లాబోర్డు వివరణ కాగితం ఆ ఉత్సాహాతిరేకంలో వామనరావు గుప్పెట్లో పడి నలిగిపోయింది.

వామనరావుకు నవ్వురాక యేం వస్తుంది, శ్రేయోరాజ్యంలో విద్యాభివృద్ధిని గురించి ఆ ఊకదంపుడు ఉపన్యాసం వింటుంటే!

• • •

ఎవరో తలుపు తట్టేరు. చిరునవ్వుతో ప్రత్యక్షమయాడు పుస్తకాల కంపెనీ ప్రతినిధి.

షికారుకు తోడుగా వచ్చాడు మంచీ-చెడూ మాట్లాడుతూ ఓ స్టోర్సు గుమాస్తా. మాది మొదటి తరగతి పేపరు...నమూనా కాగితం డ్రాయరు మీద ఉంచాడు ఇంకో యేజంటు.

—రావాల్సిన వాళ్ళంతా .. వైర్‌లెస్‌లో వార్త అందినట్టు వామనరావుతో గుసగుసలాడి కారెక్కి తుర్రుమన్నారు.

వామనరావు కిక ఊపిరి తిరగలేదు. రోజుకో పట్టణం, గంటకో చోటికి, నెలరోజుల్లో స్పెషల్ ఫీజుల ఖాతా 'నిల్ బేలెన్స్' అనిపించాడు.

నెలరోజుల్లో జేరం చేసిన సామానంతా దిగుమతయింది.

లైబ్రరీకని తెచ్చిన బీరువాలు తలుపు లూడి రావడమే కాక, లోపల అరలన్నీ బొక్కలే!

పుస్తకాలన్నీ అట్టమీద రెండురూపాయిలు వేసి బేడ ఖరీదు కంటగట్టే రైల్వే తుక్కు సాహిత్యం.

ఆటసామానులు మొదటివారానికే తునా తునకలు! కాగితాలు ఇంకిపోతున్నవని పరీక్షల్లో ఒకటే రిపోర్టులు!

అంకెల గారడీ

ద్వితీయ ప్రణాళికలో విద్యావిధానం కింద 320 కోట్ల రూపాయిలు కేటాయించబడింది. సమాజ వికాస, జాతీయ విస్తరణ కార్యకలాపాలలో విద్యాబోధన నిమిత్తం మరికొంత మొత్తం మంజూరు చేయబడుతుంది. ఇండియాలో రాష్ట్రాల ప్రణాళికలకు 225 కోట్ల రూపాయిలు కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలకు 95 కోట్లు మంజూరు చేయబడింది. ప్రస్తుతం రూపొందించిన కార్యక్రమాలు పూర్తిగా అమలు జరిపితే, ద్వితీయ ప్రణాళిక పూర్తి అయ్యేలోగా 5 నుంచి 11 ఏళ్ళ లోపు వయస్సుగల పిల్లలలో నూరింట 60 మందికిన్నీ, 11 నుంచి 14 ఏళ్ళ లోపు వయస్సుగల పిల్లలలో నూరింట 19 మందికిన్నీ విద్యాబోధనావకాశాలు ఏర్పడతాయి. ప్రాథమిక దశలో విద్యార్థుల సంఖ్య 66 లక్షలు పెరుగుతుంది మాధ్యమిక దశలో విద్యార్థుల సంఖ్య పెరుగుతుంది. ఈ లక్ష్యాన్ని సాధించడానికి 60,000 కొత్త ప్రాథమిక పాఠశాలలను 5 వేల మాధ్యమిక పాఠశాలలను నెలకొల్పవలసి వుంటుంది. అదనంగా 12,000 ప్రాథమిక పాఠశాలలనుకూడా స్థాపించవలసి ఉంటుంది.

—ప్లానింగ్ కమిషన్ ప్రకటన.

ప్రాథమిక చికిత్స కింద తెచ్చిన అమృతాంజనం డబ్బా, పెన్సిలిన్ పులుముడు మందూ అసలు లేనేలేవని డ్రిల్లుమాష్టరు గొణుగుడు.

లేబరేటరీకి తెచ్చిన సబ్బులూ, తువాళ్ళూ ఏమైనాయో సైన్సుమాష్టరి పరిశోధనకికూడా అందలేదు.

ఏమైనవని ఎవరన్నా ధైర్యంచేసి అడిగితే నాలుక బయటపెట్టి తటాలున లోపలికి తీసి, మింగేసినట్టు చిరునవ్వు నవ్వేవాడు.

నూటికి ఏభైలూ, అరవైలూ కమిషన్ ఇచ్చి చేసే వ్యాపారంలో జరిగే కుంభకోణం బహిరంగ రహస్యమే. రశీదులమీద ఏ అంకె కావాలంటే అది వేసుకుంటారు. కమిషన్‌తో నోరుమూయించి తుక్కు సరుకు సప్లయి చేస్తారు. ఇటువంటి ప్రజ్ఞలో వామనరావు ఆరితేరిన ఘటం. ఆడిట్ వాళ్ళకు అభ్యంతరం లేనిరీతిగా అన్నీ సర్దుకుపోవటం అంతా చేతిలో పనే. రశీదుల అక్షరాలా, కొట్టవచ్చినట్టు కనిపిస్తుంటే!

ఎవరైనా అలవాటుపడిన తోటి పంతుళ్లు... ఆశగా గోళ్ళల్లో మొరలెత్తి లాభంలో వాటాకి చేయి చాస్తే కిలకిలా నవ్వబుద్ధేస్తుంది వాళ్ళ సాధుస్వభావానికి. "శ్రేయోరాజ్యంలో విద్యాభివృద్ధి." కోపం వచ్చి గొంతు నొక్కేశాడు రేడియో మీట నొక్కి వామనరావు. ఉపన్యాసాల విలువ ఎంతో అతడికి తెలిసినట్టు మరెవరికీ తెలియదు.

జేబులోంచి కాగితం బయటికి తీశాడు. మొత్తం స్పెషల్ ఫీజులు మూడువేలు. కంపెనీ వాళ్ళిచ్చిన రశీదుల మొత్తం ఇరవైయైదువందలు. ప్రయాణభత్యాల ఖర్చు ఐదొందలు. వెరశి మూడు తర్వాత మూడు నిండు సున్నాలు.

తాజాకలం:—కమిషన్‌కింద వచ్చిన యెనిమిది వందలూ, భత్యఖర్చుల్లో రూల్సుప్రకారం మిగిలిన రెండొందలూ కలిసి మొత్తం పది పచ్చ నోట్లు!

తనలాంటి పగటి దొంగలకు ఈ శ్రేయోరాజ్యంలో యేం ఫరవాలేదని వామనరావు ధీమా 'ఇంతింతై వటుడింతయై' పెరిగిన వామనావతారంలా తన లౌక్యమూ పెరిగిపోతున్నదని అతడి తృప్తి.

ఆ నిష్పత్తిలో ఊహించుకొని తన తలదన్నిన పొనకాళ్ళరాయుళ్ళు, తన అన్నలు తోడుగా చాలామంది ఉన్నారని అతడి దిలాసా.

అందుకే వామనరావుకు అంత నవ్వు! ☆